కాలనీల రహదారులు ఛిద్రం

- ఏటిగట్ల రోడ్లదీ ఇదే దుస్థితి
- ఏలూరులో పేదల రాకపోకలకు ఇబ్బందులు
- రోడ్ల నిర్మాణాన్ని పట్టించుకోని పాలకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలోని పలు కాలనీలకు వెళ్లే రోడ్లు, వీటితోపాటు ఏటిగట్టు రోడ్లు ఛిద్రంగా మారాయి. చినుకు పడితేచాలు బురదమయంగా మారుతున్నాయి. వీటిపై కనీసం నడిచి వెళ్లాలన్నా వీలుపడని దుస్థితి నెలకొంది. ఇటీవల అల్పపీడనాలు, వాయుగుండాల కారణంగా కురుస్తోన్న వర్షపు జల్లులకు రోడ్లన్నీ జర్రుబుర్రులాడుతున్నాయి. ద్విచక్రవాహనంపై వెళ్లాలన్నా జారిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో కాలనీల్లో ఉంటున్న నీరుపేదలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ప్రాధాన్యతగా రోడ్లు నిర్మిస్తామన్న పాలకుల హామీ కాగితాలకే పరిమితమైంది. 100 రోజుల పాలనంటూ గొప్పగా ప్రచారం చేసుకుంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు తమగోడు పట్టడంలేదని కాలనీ ప్రజలు వాపోతున్నారు. కనీస వసతులైన రోడ్లు, డ్రెయిన్లు వంటివి నిర్మించాలని వారు కోరుతున్నారు.

పేదలకు పాట్లు

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో పలు కాలనీలు ఉన్నాయి. ప్రధానంగా స్థానిక 19వ డివిజన్‌లోని శ్రీనివాస కాలనీ, పోణంగి కాలనీ, కొమడవోలులోని వైఎస్సార్ కాలనీ ఇలా అన్నీ కాలనీల్లోనూ నూటికి 95 శాతానికి పైగా నివశించేది నిరుపేదలే. వీరందరూ ప్రతి రోజూ ఉదయం పనుల కోసం బయటకు వచ్చి తిరిగి సాయంత్రం తమ ఇళ్లకు చేరతారు. ఛిద్రంగా మారిన రోడ్లపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



19వ డివిజన్ శ్రీనివాస నగర్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి



అధ్వానంగా ఉన్న శ్రీనివాస నగర్‌కాలనీ లోపల రోడ్డు



ఛిద్రంగా ఉన్న కొత్తూరు జూట్ మిల్లుకు వెళ్లే ఏటిగట్టు రోడ్డు

కనీస సౌకర్యాలు కల్పించాలి



ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వం నిర్మించిన కాలనీల్లో కనీస సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించాలి. ప్రధానంగా రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. పేదల సంక్షేమానికి పాలకులు చిత్తశుద్ధితో పనిచేయాలి. పేదల కాలనీల పట్ల నిర్లక్ష్యం తగదు.

– పి.కిషోర్, ఏలూరు నగర కార్యదర్శి, సీపీఎం

చినుకు పడితే ఛిద్రమే



పేదల కాలనీల్లో చినుకు పడితే రోడ్డుపై నడిచి వెళ్లే పరిస్థితి ఉండదు. కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించి పాలకులు తమ చిత్తశుద్ధిని చాటుకోవాలి. హనుమాన్ నగర్ నుంచి కొత్తూరు జూట్ మిల్లు వైపు పెదపాడు రోడ్లో వెళ్లాలంటే శ్రీనివాస్ నగర్ మీదుగా వెళ్లాల్సి ఉంది. ఈ కాలనీలో రోడ్లన్నీ పాడైపోయాయి. పిల్లలు స్కూల్స్‌కి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు.

– సీహెచ్ రాజ్యలక్ష్మి, హనుమాన్ నగర్, ఏలూరు

రోడ్లు అధ్వానం



మా డివిజన్‌లోని అన్ని రోడ్లూ అధ్వానంగా ఉన్నాయి. ముఖ్యంగా శ్రీనివాస్ నగర్ మీదుగా కొత్తూరు జూట్ మిల్లు, శివ నగర్, సాయి నగర్ ప్రాంతాలకు, పెదపాడు వైపు వెళ్లే ఏటిగట్టు రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఆటోలు, ట్రాక్టర్లు వెళ్తుంటే తిరగబడి ప్రమాదాలకు గురవుతున్నాయి. తక్షణం పాడైపోయిన రోడ్లను నిర్మించాలి.

– చల్లా సురేష్, ఆటో డ్రైవర్, 19వ డివిజన్, ఏలూరు

క్లుప్తంగా

శనివారపుపేటలో సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జి.రవికిషోర్

ఏలూరు (టూటౌన్): శనివారపు పేట అన్నే నగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, గవరవరం గట్టు కాలనీలకు డ్రెయిన్ కల్వర్టు నిర్మించాలని, శ్రీరామ్‌నగర్‌లో డ్రెయిన్ నిర్మించాలని సీపీఎం శనివారపు పేట గ్రామ శాఖ డిమాండ్ చేసింది. సోమవారం ఉదయం స్థానిక శనివారపు పేటలో స్థానిక పార్టీ శాఖ సభ మురళి అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు గొట్టాపు మురళి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ శాఖ కార్యదర్శి గొట్టాపు రవి కిషోర్ మాట్లాడుతూ శనివారపు పేట గ్రామాన్ని కార్పొరేషన్‌లో కలపడం వల్ల పంచాయతీ ప్రజలకు ఇంటి పన్నులు, నీటి కుళాయి పనులు భారీగా పెరిగాయని తెలిపారు. పార్టీ నగర కార్యదర్శి పళ్లెం కిషోర్, నాయకులు కె.రామాంజనేయులు మాట్లాడారు.

సమీక్షా సమావేశం

ఏలూరు(మెట్రో): స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా విద్యా శాఖ అధికారులతో సోమవారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గతేడాది జిల్లా విద్యా శాఖ సహకారంతో విద్యార్థులకు అందించిన విజయకేతనం స్టడీ మెటీరియల్ మంచి ఫలితాలు ఇచ్చిందని ఆమె అన్నారు.

వైభవంగా పరమటమ్మ ఆలయ పునఃప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట పాత నీళ్ల ట్యాంక్ ప్రాంగణంలో 41, 42, 43 డివిజన్లకు సంబంధించిన శ్రీ పరమటమ్మ (గోనాలమ్మ) ఆలయ పునఃప్రారంభ కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు మంత్రవాది రామకృష్ణ ఆధ్వర్యంలో యజ్ఞ హోమాలు, కుంకుమ, అష్టోత్తర శతనామ పూజలు చేశారు. కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ మహిళా భక్త బృందం ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలతో కోలాటం, తాళాలు నృత్య ప్రదర్శనలతో 108 మంది మహిళలచే 108 రకాల సారితో నగర వీధుల్లో పాదయాత్రగా విచ్చేసి అమ్మవారికి సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

నేడు అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

ఏలూరు (టూటౌన్): విభిన్న ప్రతిభావంతుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశం మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించనున్నట్టు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు.

ఆహార నాణ్యతలో రాజీ పడొద్దు



చిల్డ్రన్ హోమ్‌లో బాలుడి వివరాలు అడిగి తెలుసుకుంటున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): వసతి గృహాలు, చిల్డ్రన్ హోమ్‌లలో చిన్నారులకు అందించే ఆహారం విషయంలో రాజీ పడొద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో రత్న ప్రసాద్ పోణంగి రోడ్డులోని రవితేజ చిల్డ్రన్ హోమ్, వట్లూరులోని గునెల్లా చిల్డ్రన్ హోమ్, హనుమాన్ జంక్షన్‌లోని ఆశాజ్యోతి విభిన్న ప్రతిభావంతుల గృహం, లైఫ్ గివెర్స్ చిల్డ్రన్ హోమ్, కొక్కిరిపాడు లోని షేర్, భోగాపురం లోని విన్ అవర్ నేటివ్ చిల్డ్రన్ హోమ్‌ం, కొప్పాకలోని సెయింట్ జాన్సన్ కేర్ హోంలను సోమవారం ఆయన సందర్శించారు. సంక్షేమ గృహాల్లోని బాల బాలికలకు అందిస్తున్న వసతులు, ఆహార పదార్థాల నాణ్యత, మంచినీటి సౌకర్యాలపై ఆరా తీశారు. బాల బాలికలకు న్యాయ సహాయం అవసరమైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 15100కు ఫోన్ చేసి పొందాలని సూచించారు.

కల్లాల్లోనే ధాన్యం కొనాలి

ఏలూరు (టూటౌన్): రైతుల కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ధాన్యం కొనుగోలు సమస్యలపై వారు స్థానిక అన్నే భవనంలో మాట్లాడారు. పంట పండించడానికి కంటే పంట అమ్ముకోవడానికి రైతు ఎక్కువ కష్టపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా పంటను రక్షించుకొనేందుకు ఎటువంటి సౌకర్యాలు అందుబాటులో లేక అన్నదాత నష్టపోవాల్సి వస్తుందని వివరించారు. సామూహిక కల్లాలు, గ్రామీణ ప్రాంతాల్లో పంట నిల్వ చేసుకునే షెడ్లు నిర్మించాలని, సబ్సిడీపై టార్పాలిన్లు అందించాలని కోరారు. పంట సాగు చేస్తున్న కౌలు రైతుల పేర్లతోనే ధాన్యం కొనాలని, ఈ–క్రాప్‌లో పేర్లు నమోదు చేయాలని అన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

తేమ శాతం వంటి నిబంధనలను సడలించాలని, రైతు నుంచి ధాన్యం కొన్న తర్వాత మిల్లులకు తరలించే బాధ్యత ప్రభుత్వ యంత్రాంగమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సేవా కేంద్రాల్లో నిర్ణయించిన తేమ శాతం, తూకం ఆధారంగా మిల్లు వద్ద ధాన్యం దిగుమతి చేసుకోవాలని కోరారు. నాణ్యమైన గోనె సంచులు అందించాలన్నారు. రైతు ధాన్యం 48 గంటల్లో సొమ్ములు చెల్లించేలా ముందుగా తగు నిధులు కేటాయింపు చేయాలని అన్నారు. ధాన్యం రవాణాకు రైతుల ఎడ్ల బండ్లను అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

పోలీస్ అధికారులకు ప్రశంసలు

ఏలూరు టౌన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించారు. పోలీస్ కవాతు నిర్వహించి స్మృతి పరేడ్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, జిల్లా జడ్జి పురుషోత్తం, కలెక్టర్ వెట్రి సెల్వి, ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు హాజరయ్యారు. జిల్లాలో ఆయా కేసులను చేధించటంలో కీలకపాత్ర పోషించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ శివ కిషోర్ చేతులమీదుగా డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఏలూరు ఎస్‌బీ సీఐ బి.ఆదిప్రసాద్, నిడమర్రు సీఐ ఎం సుభాష్, జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ప్రశంసా పత్రాలను అందుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణతోపాటు, ఆయా కేసుల్లో నిందితులను పట్టుకుని అరెస్ట్ చేయటంలో ప్రతిభ చూపారని, పోలీస్ అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్, ఎస్పీలు సూచించారు.



కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ శివకిషోర్‌ల నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్



ఎస్‌బీ సీఐ ఆదిప్రసాద్



సీఐ సుభాష్



సీఐ వెంకటేశ్వరరావు

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ఈ నెల 22 నుంచి 25 వరకుఆధార్ నమోదు, ఆధార్ అప్‌గ్రేడ్ శిబిరాలు నిర్వహించనున్నట్టు కమిషనర్ ఎ.భానుప్రతాప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పాఠశాలలు, కాలేజీలు, నగరంలోని యాదవ్ నగర్, ఆర్‌ఆర్‌పేట, తోకూరదొడ్లు, నరసింహారావుపేట, మోతేవారి తోట, శేఖర్ వీధి, పోస్టల్ కాలనీ, కోట దిబ్బ ప్రాంతాల్లోని సచివాలయాల్లో శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	38
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	23
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	29
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	33
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	32
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు – తిరుపతి	16.00	4830	28

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	40–46	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	60	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	07,10
బెండకాయలు	34	కంద	60
పచ్చిమిర్చి	40–44	బీట్‌రూట్	44–48
కాకర కాయలు	36–44	కీరా దోస	36
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	00
బీరకాయలు (పందిరి)	48	అల్లం	80–150
క్యాబేజీ	32–36	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	48–56	పాలకూర	12
దొండకాయలు	28–34	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	30–54	గోంగూర	07
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	36–44	బఠాణీ	--
ఆనబకాయ (1)	30–40	క్యాప్సికమ్	80–94
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	44

25న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 25వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరలో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వి శ్రీలత చెప్పారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, హౌసింగ్, రెవెన్యూ తదితర శాఖ అధికారులు పాల్గొని, ప్రగతి పనులపై చర్చిస్తారని పేర్కొన్నారు.

రజక చెరువుల జీఓల అమలుకు డిమాండ్

ఏలూరు (టూటౌన్): గ్రామాల్లో రజకులకు కేటాయించిన వృత్తి చెరువుల విషయంలో అధికారులు ప్రభుత్వ జీఓలను తప్పకుండా అమలు చేయాలని రజక జన సంఘ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. స్థానిక రజక జన సంఘ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. దేవరపల్లి మండలం చిన్నాయగూడెం గ్రామం రజక సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చిన్నాయగూడెం గ్రామ రజకులు మాట్లాడుతూ గ్రామంలో వృత్తి చెరువు సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై కట్లయ్య మాట్లాడుతూ గ్రామ సంఘాలకు గ్రామ పంచాయతీలు కేటాయించిన చెరువుల్లో ఆక్రమణలను తొలగించాలన్నారు. ఇటీవల రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి తమ గ్రామ పర్యటనకు వచ్చిన సందర్భంగా తమ సమస్యలను వివరించినట్లు రజక నేతలు తెలిపారు. అనంతరం రజక సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాడిమల్ల శీను, ఉపాధ్యక్షుడిగా పెనుగుర్తి శీను, కార్యదర్శిగా పల్లంట్ల సత్యనారాయణ, పాలూరు పోసిబాబు, పల్లంట్ల నాగేశ్వరరావు, సభ్యులుగా గుంటుపల్లి అమ్మన్న, ఏడుకొండలు ఎన్నుకున్నారు.



రజక ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

రైతాంగ సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ఏలూరు (టూటౌన్): రైతాంగ, ప్రజా సమస్యలపై సోమవారం ఏలూరు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సీపీఐ నాయకులు వినతి పత్రాలను అందజేశారు. ఏలూరు జిల్లా ముసునూరు మండలం గుల్లపూడి, లోపూడి, చెక్కపల్లి లింగపాలెం మండలం కలరాయన గూడెం గ్రామాలకు చెందిన రైతులకు మొక్కజొన్న విత్తనాల కంపెనీల వారు నకిలీ విత్తనాలు ఇచ్చారని, దీంతో దిగుబడి రాక రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారని ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మొక్కజొన్న సీడ్స్ కంపెనీల ఆర్గనైజర్స్‌పై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. జంగారెడ్డిగూడెం మండలంలో రైతు భూమికి సంబంధించి హక్కు పత్రాలు ఇప్పించాలని, చింతలపూడి మండలం మల్లాయగూడెం గ్రామ ప్రజలకు తాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వరప్రసాదరావు ఆనంద్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జేవీ రమణ రాజు, బీకేఎంయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోలిమే బాల యేసు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

చర్మ వ్యాధులపై నూతన చికిత్సా విధానం



సదస్సులో పాల్గొన్న వైద్యులు

ఏలూరు రూరల్ : ఆశ్రం ఆసుపత్రి ఆవరణలో చర్మ వ్యాధుల నూతన చికిత్స విధానంపై సోమవారం సదస్సు నిర్వహించామని ఆశ్రం సీఈఓ డాక్టర్ కె.హనుమంతురావు ఓ ప్రకటనలో తెలిపారు. పలు రకాల చర్మ వ్యాధుల, చర్మంపై ఏర్పడ్డ కంతులు చికిత్స విధానంతో పాటు ఆపరేషన్ చేసే విధానం, బొల్లి, పుట్టు మచ్చలు తొలిగింపు అంశాలపై శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు పొందిన ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన 176 మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సర్జన్లు, అనస్థీషియాలజిస్టులుతో పాటు ఆశ్రం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చేబ్రోలు శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ వేణుగోపాలరాజు, సూపరింటెండెంట్ డాక్టర్ శాంతయ్య, గ్రూప్ సీఓఓ రాజరాజన్ పాల్గొన్నారని వివరించారు.



చర్మ వ్యాధుల చికిత్స విధానాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ ఏలూరు నగర శాఖ అధ్యక్షుడు కురమా ఆనంద కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఈదర సుబ్బమ్మ దేవి మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆ సంఘం ఏలూరు నగర శాఖ సమావేశానికి ఆనంద కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు జీపీఎఫ్ ఖాతాలను తెరవాలని కోరారు. ఉపాధ్యక్షుడు ఎల్‌వీఏ రత్నకుమార్ మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో స్పెషల్ ఎడ్యుకేషన్ చేసిన వారికి స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను మంజూరు చేయాలన్నారు. జిల్లా కౌన్సిలర్ వీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అసంబద్ధమైన వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ను సరిచేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం విడుదల చేయాలని, దీపావళి కానుకగా 30 శాతం మధ్యంత భృతి ప్రకటించాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు జె.శాంతి కుమార్, పి.రోజా, కె.పొట్టియ్య, జి.రాజారావు, ఎ.సాంబమూర్తి, టి.శ్రీనివాసరావు, చింతా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



ఏపీటీఎఫ్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

కోమటిలంక ఉపసర్పంచ్‌పై ఫిర్యాదు

ఏలూరు రూరల్ : కోమటిలంక ఉపసర్పంచ్ ఘంటసాల దమయంతికి ఇన్‌చార్జి సర్పంచ్ బాధ్యతలు అప్పగించవద్దని గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ఎంపీడీఓ వి.శ్రీలతను కోరారు. సోమవారం వార్డు సభ్యులు నెంద్ర ఎలీషా, జె.మరియమ్మ, తెనాలి మణి, నెంద్రు రవి, పెనుమట్ల స్వాతి మండలపరిషత్ కార్యాలయానికి వచ్చి ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఇటీవల సర్పంచ్ పదవికి రాజీనామ చేసిన తెనాలి యోహాన్ స్థానంలో ఉపసర్పంచ్ దమయంతికి బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఉపసర్పంచ్ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, వార్డు సభ్యులతో సఖ్యత లేనందున ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించవద్దని పేర్కొన్నారు. మరో వార్డు సభ్యుడు నెంద్రు ఎలీషాను ఉపసర్పంచ్‌గా నియమించి బాధ్యతలు అప్పగించాలని కోరారు. సభ్యులు డీపీఓ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు.